నేడు ఉచిత కేన్సర్ వైద్య శిబిరం

ఆల్విన్‌కాలనీ: రిపబ్లిక్ డే సందర్భంగా రామ్ దేవ్ రావ్ హాస్పిటల్‌లో ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉచిత మెగా కేన్సర్ స్క్రీనింగ్ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ వైద్య శిబిరంలో నోటి కేన్సర్, రొమ్ము కేన్సర్, గర్భాశయ ముఖ ద్వారం కేన్సర్, మమ్మోగ్రఫీ, ఎక్స్ రే, ఎంఆర్ఐ, సీబీపీ, లిక్విడ్ బేస్ సైటాలజీ, యూఎస్‌జీ ఎబ్డమన్ వంటి వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ వైద్య శిబిరాన్ని పరిసర ప్రాంత ప్రజలు వినియోగించుకోవాలన్నారు.

క్యాట్ లెవెల్ 2లో విద్యార్థుల ప్రతిభ



కూకట్‌పల్లి: సర్దార్ పటేల్ నగర్‌లోని శ్రీ చైతన్య బాలికల రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థినులు నాలెడ్జ్ ఎసెస్మెంట్ లెవెల్ 2లో తమ ప్రతిభ కనబరిచారు. విద్యార్థినులు 11 మందికి నగదు ప్రైజ్, మెడల్స్, సర్టిఫికెట్‌లు లభించాయి. వారిని పలువురు అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లక్ష్మి, ఏజీఎం శివరామకృష్ణ, ఆర్ఐ పద్మజ, సమన్వయకర్త వెంకటశివ, డీన్ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడలకు ప్రభుత్వం ప్రాధాన్యం



వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న హరివర్ధన్‌రెడ్డి, బండి రమేష్

కూకట్‌పల్లి: ప్రభుత్వం విద్య తరువాత క్రీడలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు హరివర్ధన్‌రెడ్డి, కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. శనివారం కేపీహెచ్‌బీ కల్చరల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు శేరి సతీష్‌రెడ్డి ఆధ్వర్యంలో ముఖ్య అతిథులుగా హాజరై ముఖ్యమంత్రి వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. ప్రతి నియోజకవర్గంలో ఇలాంటి టోర్నమెంట్‌లు జరగాలని ఆకాంక్షించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకొని అభినందనలు తెలిపారు.

జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎంలో వసతులేవి?

- తాగునీటి లీకేజీలతో రోడ్లు బురదమయం
- దోమలు, ఈగలకు ఆవాసంగా ఇళ్ల పరిసరాలు
- సమస్యలు పరిష్కరించాలని ప్రజల వేడుకోలు





అస్తవ్యస్తంగా ఉన్న మంచినీటి, ఇతర పైపులైన్లు, కేబుల్స్, ఇళ్ల మధ్య చెత్తా చెదారం

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి సర్కిల్ ఆల్విన్‌కాలనీ డివిజన్‌లోని జేఎన్ఎన్‌యూఆర్ఎం ఇళ్ల సముదాయాల పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్యం పడకేసింది. అస్తవ్యస్తంగా ఉన్న ఇళ్ల పరిసర ప్రాంతాలు, డ్రైనేజీ సమస్యకు తోడు మంచినీటి పైపులైన్ల లీకేజీ పర్వంతో రోడ్లన్నీ బురదమయంగా మారాయి. తాగునీరు రోడ్డు పాలవుతుంది. బురద వల్ల దుర్గంధం, దుర్వాసనతో ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు. సర్కిల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం ఉండటం లేదని స్థానికులు వాపోతున్నారు. మూడు దశాబ్దాల క్రితం ఈ ప్రాంతంలో జేఎన్ఎన్‌యూఆర్ఎం ఇళ్ల సముదాయాలు నిర్మించారు. ఎలాంటి వసతులు



కల్పించకపోవటంతో ఆ ప్రాంతమంతా మురికి కూపంగా మారింది. అయినప్పటికీ అక్కడ నివసించే పేద ప్రజలు ఇంటి అద్దెలు చెల్లించలేక ఆ మురికి కూపంలోనే జీవనం కొనసాగించాల్సి వస్తుంది. వాటర్ కనెక్షన్‌లు కూడా లేకపోవటంతో వారే సొంత ఖర్చులతో మంచినీటి కనెక్షన్లు తీసుకున్నారు. ఇబ్బడి ముబ్బడిగా ప్లాస్టిక్ పైపులైన్లను ఎవరికి వారే ఏర్పాటు చేసుకున్నారు. పోకిరీలు ఆ పైపులైన్లను తొలగిస్తుండటంతో మంచినీరు సరఫరా అయినప్పుడు ఆ మంచినీటిలో కలుషిత జలాలు చేరుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రాథమిక పాఠశాల ప్రాంతం కూడా దుర్గంధం ఉండటంతో విద్యార్థులు పాఠశాలకు కూడా పోవటం లేదని పలువురు పేర్కొన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు నిర్లక్ష్యం వీడి మౌలిక సౌకర్యాలు కల్పించాలని నివాసితులు కోరుతున్నారు.

మురికి కూపంలోనే జీవనం



పేద ప్రజలు మురికికూపంలోనే జీవనం కొనసాగిస్తున్నారు. రెక్కాడితే గాని డొక్కాడని పరిస్థితి. సీజనల్ వ్యాధులతో పాటు ఇక్కడి మురికికూపం వల్ల చిన్నారులు, వయో వృద్ధులు అనారోగ్యాలకు గురై ఆసుపత్రుల పాలవుతున్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, మురుగు నీటి సమస్యతో పాటు తాగునీటి లీకేజీలతో రోడ్లనీ బురదమయంగా మారుతున్నాయి. ఇళ్లల్లో ఉండలేని పరిస్థితి నెలకొంటుంది. ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు ఈ ప్రాంతాన్ని పరిశీలించి సౌకర్యాలు కల్పించాలి. – శ్రీనివాస్, స్థానికుడు

మురుగునీరు కలువకుండా కాలువ నిర్మిస్తాం

పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే గాంధీ



పనులను పరిశీలిస్తున్న పీఏసీ చైర్మన్ గాంధీ

ఆల్విన్‌కాలనీ: అంబీర్ చెరువులో మురుగునీరు చేరకుండా చెరువు చుట్టూ మురుగు నీటి కాలువ నిర్మాణం, అలుగు మరమ్మతులు, చెరువు కట్ట బలోపేతం, వాకింగ్ ట్రాక్ వంటి పనులు చేపడతామని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ అన్నారు. హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని ప్రగతినగర్ అంబీర్ చెరువు సుందరీకరణ పనులను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెరువు సుందరీకరణ, సంరక్షణ, అభివృద్ధి పనులు తుది దశలో ఉన్నాయన్నారు. చెరువు పరిసర ప్రాంతాల ప్రజల విజ్ఞప్తి మేరకు గుర్రపు డెక్క తొలగింపు చేపట్టామన్నారు. గుర్రపు డెక్కను వేగంగా తొలగించి తరలించాలని అధికారులకు సూచించారు. అదే విధంగా చెరువు సంరక్షణలో భాగంగా చెరువు చుట్టూ ఫెన్సింగ్ నిర్మాణం, చెరువు అలుగు నిర్మాణం, చెరువు సుందరీకరణ పనులు చేపడుతున్నామని తెలిపారు. పనుల్లో నాణ్యత పాటించి త్వరగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పైపులైన్ పనుల పరిశీలన



పైపులైన్ పనులను పరిశీలిస్తున్న శ్రావణ్‌కుమార్

మూసాపేట: మూసాపేట డివిజన్‌లోని చైతన్య బస్తీలో జరుగుతున్న తాగునీటి పైపులైన్ పనులను శనివారం మాజీ కార్పొరేటర్ శ్రావణ్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి ప్రత్యేక చొరవతో నూతన పైపులైన్ కోసం నిధులు మంజూరు చేయించామని తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్, జిల్లా గోపాల్, గరిగె తుకారాం, జిల్లా బాబూరావు, అయిలయ్య, కె. శ్రీనివాస్, ఇనుగంటి రాజు, జైరాజ్, నరేష్‌గుప్తా, అనంత్ గౌడ్, రాము, కుమార్, గోపాల్, వినోద్, కోటి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ వసూళ్లకు పాల్పడే వారిపై చర్యలు తీసుకోవాలి



ఏసీపీకి వినతిపత్రం అందజేస్తున్న ప్రెస్ క్లబ్ నాయకులు

కూకట్‌పల్లి: జర్నలిజం పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడే అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని కూకట్‌పల్లి ప్రెస్ క్లబ్ నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం ఏసీపీ శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ మధ్య కాలంలో జర్నలిస్టుల విలువలు మసకబారే విధంగా కొందరు ప్రవర్తిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుల నుంచి ఫిర్యాదులు అందితే తప్పకుండా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఏసీపీ తెలిపారు. కార్యక్రమంలో జర్నలిస్టు సంఘాల నాయకులు గడ్డమీది బాలరాజు, దయాసాగర్, తొట్ల పరమేష్, నిమ్మల శ్రీనివాస్, ఎంఏ కరీం, నవీన్‌రెడ్డి, వేణు, నాగరాజు, క్రాంతి, గంగరాజు, మహేష్, మాణిక్య రెడ్డి, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

గమ్యస్థానాలకు చేర్చే బాధ్యత డ్రైవర్లదే



కార్యక్రమంలో పాల్గొన్న ఎంవీఐ శ్రీనివాసులు, డిపో మేనేజర్ హరి తదితరులు

మూసాపేట: ప్రయాణికులను గమ్య స్థానాలకు చేర్చే బాధ్యత డ్రైవర్లదేనని ఆర్‌టీఏ ఎంవీఐ శ్రీనివాసులు అన్నారు. కూకట్‌పల్లి ఆర్టీసీ డిపోలో శనివారం జాతీయ రోడ్డు భద్రతా మసోత్సవాలు నిర్వహించారు. డ్రైవర్లకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రైవర్లు ట్రాఫిక్ సిగ్నల్స్ పాటిస్తూ బస్సులు నడపాలన్నారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ హరి, అసిస్టెంట్ మేనేజర్ శ్రీలత, మెకానిక్ ఫోర్‌మెన్ రాజేశ్వరి, డ్రైవర్ వెల్ఫేర్ మెంబర్లు శ్రీనివాస్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ సమక్షంలో బీజేపీలో చేరికలు

మోతీనగర్: మూసాపేట డివిజన్ అవంతినగర్‌కు చెందిన చిట్టబోయిన నర్సింగరావు ముదిరాజ్, కొండపల్లి శ్రీలత శనివారం బీజేపీలో చేరారు. వారికి ఎంపీ ఈటల రాజేందర్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నార్లపురం శ్రీనివాస్, పిట్ల వినోద్, మనోహర్, శోభ పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో ఎంపీ ఈటల

జాతీయ ఓటరు దినోత్సవం



ఓటరు దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

మూసాపేట: మూసాపేటలోని శ్రీ సాయి విద్యానికేతన్ స్కూల్‌లో శనివారం జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ సత్యనారాయణ మాట్లాడుతూ.. ప్రజా స్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని మల్లు రవిని కలిసిన నేతలు


కుత్బుల్లాపూర్: నాగర్ కర్నూల్ లోక్ సభ సభ్యులు, హెచ్‌ఎంటీ కంపెనీ మెషిన్ టూల్స్ ఎంప్లాయీస్ యూనియన్ చీఫ్ ప్యాటన్ మల్లు రవిని శనివారం ఆయన నివాసంలో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ ఆధ్వర్యంలో యూనియన్ సభ్యులు కలిశారు. హెచ్‌ఎంటీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారని వారు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ సభ్యులు శ్రీనివాస్ రెడ్డి, కేశవ్, శ్రీహరి, లక్ష్మణ్ జి, కుమార్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో జాతీయ బాలికల దినోత్సవం



కార్యక్రమంలో పాల్గొన్న సూపర్ వైజర్ జ్యోతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు.

మూసాపేట: మూసాపేట హరిజన వాడలోని అంగన్‌వాడీ కేంద్రంలో జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా 'బేటీ బచావో-బేటీ పడావో' కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జ్యోతి మాట్లాడుతూ.. బాలికలు ధైర్యంగా సమాజంలో ఉన్న పరిస్థితులను ఎదుర్కోవాలన్నారు. ఉన్నత శిఖరాలకు చేరాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ కవిత, సంగీత తదితరులు పాల్గొన్నారు.



లివర్ ఉచిత స్క్రీనింగ్ క్యాంప్



లివర్ ఉచిత స్క్రీనింగ్ క్యాంపును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీ డివిజన్‌లో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మందలపు సాయిబాబు ఆధ్వర్యంలో శనివారం రేనోవా హాస్పిటల్ సౌజన్యంతో లివర్ ఉచిత స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు హాజరై ప్రారంభించారు. ఉచిత వైద్య శిబిరాలను పరిసర ప్రాంత ప్రజలు వినియోగించుకోవాలన్నారు. వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసిన సాయిబాబును అభినందించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లీన్ క్యాంపస్ లక్ష్యంగా..

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ క్యాంపస్‌ను క్లీన్ క్యాంపస్‌గా మార్చడమే లక్ష్యంగా ఎన్ఎస్ఎస్ విభాగం పనిచేస్తుందని ఆ సంస్థ కోఆర్డినేటర్ డాక్టర్ బి కృష్ణయ్య స్పష్టం చేశారు. శనివారం హెచ్‌సీయూ క్యాంపస్‌లోని స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ ప్రాంగణంలో క్లీన్ అప్ డ్రైవ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ ప్రాంగణంలో ప్లాస్టిక్ వాటర్ బాటిళ్ల తొలగింపు, బ్యాగులు, వ్యర్థ పదార్థాలు, చెత్తాచెదారం తొలగించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ భీంసింగ్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, శానిటేషన్, హార్టికల్చర్ విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు.



ముగిసిన అంతర్జాతీయ సదస్సు

నిజాంపేట్: ప్రగతినగర్‌లోని వీఎన్ఆర్ విజ్ఞాన జ్యోతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో డిజిటల్ హ్యూమానిటీస్ గురించి మూడు రోజుల పాటు జరిగిన అంతర్జాతీయ సదస్సు శనివారం ముగిసింది. వివిధ రంగాలకు, సంస్థలకు చెందిన పరిశోధకులు, విద్యావేత్తలు చర్చల్లో పాల్గొని సదస్సుని విజయవంతం చేశారని డా.వై.వి.సుధాదేవి తెలిపారు. సదస్సులో విశిష్ట అతిథిగా ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డా.ఏవీ గురవారెడ్డి హాజరై మాట్లాడారు. మానవీయ శాస్త్రాల్లో సాంకేతికత వాడటం వల్ల కొత్త అవకాశాలే కాక ఇబ్బందులు కూడా రావచ్చని హెచ్చరించారు. డిజిటల్ సాంకేతికతలు అందుబాటులో ఉండటం వల్ల వైద్యులు సుదూరంగా ఉన్న పేషెంట్లని కూడా కనిపెట్టుకుని ఉండవచ్చన్నారు. అంతర్జాలం వల్ల ప్రజలకు విషయ సేకరణ సులభమైందని, వాటిలో నిజనిజాలను నిర్ధారించుకోవడానికి అనుభవమున్న నిపుణుల సలహాలు తీసుకోవాలన్నారు. సదస్సులో భాగంగా డిజిటల్ పోస్టర్ ప్రదర్శనతో పాటు లఘుచిత్రాల పోటీకూడా నిర్వహించారు. ముగింపు కార్యక్రమంలో ఎంపిక చేసిన లఘు చిత్ర ప్రదర్శన జరిగింది. కార్యక్రమంలో ఆంగ్లభాషా విభాగాధిపతి డా.కె.నీలవేణి, డా.సీడీ నాయుడు, డా.బి.చెన్నకేశవరావు వివిధ విద్యా సంస్థలకు చెందిన అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఆవిష్కరణలపై ఆసక్తి చూపాలి

దుండిగల్: విద్యార్థులు నూతన ఆవిష్కరణలపై ఆసక్తి చూపాలని కేంద్ర ప్రభుత్వ ఎంఎస్ఎంఈ మాజీ అసిస్టెంట్ డైరెక్టర్ కేసీ చౌదరి అన్నారు. దుండిగల్‌లోని ఎంఎల్ఆర్ఐటీ కళాశాలలో శనివారం ఇన్నోవేషన్ ఛాలెంజ్ అండ్ ప్రాజెక్ట్ ఎక్స్‌పో 2క25కి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ఇలాంటి వేదికలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. 40కు పైగా వినూత్న ప్రాజెక్టులను ప్రదర్శించగా 200 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె. శ్రీనివాస్ రావు, డీన్ డాక్టర్ రాధికా దేవి, హ్యూమానిటీస్ అండ్ సైన్సెస్ విభాగాధిపతి డాక్టర్ సీహెచ్. అచ్చిరెడ్డి, కో ఆర్డినేటర్లు డాక్టర్ వై. బలరాం, అధ్యాపకులు పాల్గొన్నారు.



'మనూ'లో రేపటి నుంచి వార్షిక సదస్సు

రాయదుర్గం: మనూలో గాంధేయ జర్నలిజంపై 45వ వార్షిక సదస్సును నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. యూనివర్సిటీలోని మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం విభాగం ఆధ్వర్యంలో ఈనెల 27 నుంచి 29వ తేదీ వరకు ఇండియన్ సొసైటీ ఆఫ్ గాంధీయన్ స్టడీస్ వార్షిక సదస్సును నిర్వహించేందుకు సిద్ధమవుతోంది. 27వ తేదీ ఉదయం 10 గంటలకు క్యాంపస్‌లోని సీపీడీయూఎంటీ ఆడిటోరియంలో ప్రారంభ సమావేశాన్ని నిర్వహిస్తారు. 'మనూ' వీసీ ఐనుల్ హసన్ అధ్యక్షతన జరిగే కార్యక్రమంలో భారత్ ఎక్స్‌ప్రెస్ సీఎండీ ఉపేంద్రరాయ్, బీబీసీ న్యూఢిల్లీ ప్రతినిధి ఇక్బాల్ అహ్మద్ తదితరులు పాల్గొననున్నారు.

కాలనీల అభివృద్ధే ప్రధాన ఎజెండా

ఎమ్మెల్యే కెపి వివేకానంద



నిజాంపేట్‌లో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వివేకానందగౌడ్ తదితరులు

నిజాంపేట్: కాలనీల అభివృద్ధే ప్రధాన ఎజెండా అని ఎమ్మెల్యే కెపి వివేకానంద అన్నారు. శనివారం నిజాంపేట్‌లోని 11, 13 డివిజన్‌లతో పాటు 30వ డివిజన్‌లోని శివాజీ నగర్‌లో అభివృద్ధి పనులను మేయర్ నీలాగోపాల్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్‌తో కలిసి ప్రారంభించారు. అదేవిధంగా కేటీఆర్ కాలనీలో కమ్యూనిటీ హాల్ ప్రారంభం, కేటీఆర్ కాలనీ రోడ్డు నంబర్ 6, 7లో సీసీ రోడ్డు శంకుస్థాపన, రామభద్ర అపార్ట్‌మెంట్స్ నుంచి జయదీపిక వరకు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, బెవర్లీ పాల్మ్స్‌లో బీటీ రోడ్డు ప్రారంభం, కోలన్ రాజిరెడ్డి హైట్స్ నుంచి వాటర్ ట్యాంక్ 600 ఎంఎం డయా అండర్ గ్రౌండ్ డ్రైనేజీకి శంకుస్థాపన, జర్నలిస్టు కాలనీ నుంచి చెర్ల ఎల్లమ్మ గుడి వరకు సీసీ రోడ్డు ప్రారంభం, శివాజీ నగర్ కాలనీలో సీసీ రోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ప్రారంభం తదితర అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలన్నారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, పార్టీ అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దుతా..

కుత్బుల్లాపూర్: మౌలిక వసతుల కల్పనలో నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే వివేకానందగౌడ్ అన్నారు. శనివారం నిజాంపేట్ కార్పొరేషన్, కొంపల్లి, దుండిగల్ మున్సిపల్ పరిధిల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత పదేళ్ల పాలనలో వందలాది కోట్ల నిధులతో నియోజకవర్గ వ్యాప్తంగా అభివృద్ధి పనులు పూర్తి చేశామని, రాష్ట్రంలో కుత్బుల్లాపూర్‌ను ప్రత్యేక స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.

◆ కొంపల్లి మున్సిపల్ పరిధిలో రూ.2.79 కోట్ల నిధులతో సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీ, తాగునీటి పైపులైన్‌లు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు.

ప్రలోభాలకు లోనుకాకుండా ఓటును వినియోగించుకోవాలి

జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి



ప్రతిజ్ఞ చేయిస్తున్న అదనపు కలెక్టర్



సాక్షి,సిటీబ్యూరో: ఎటువంటి ప్రలోభాలకు లోనుకాకుండా ఓటును వినియోగించుకున్నప్పుడే మంచి సమాజం ఏర్పడుతుందని జిల్లా అదనపు కలెక్టరు విజయేందర్‌రెడ్డి అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం మేడ్చల్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో డీఆర్‌ఓ హరిప్రియతో కలిసి జిల్లా అదనపు కలెక్టరు విజయేందర్ రెడ్డి ఉద్యోగులందరితో ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో 15వ జాతీయ ఓటరు దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ మైదానంలో విద్యార్థులు, యువకులతో కలిసి జిల్లా అధికారులు, ఉద్యోగులు ప్లకార్డులు చేబూని, ప్రత్యేక డ్రెస్సు, టోపీలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విజయేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సంఘం ప్రతి ఏడాదికి నాలుగుసార్లు ఓటరు నమోదు కార్యక్రమానికి అవకాశం కల్పిస్తోందన్నారు. ఓటరు నమోదు కోసం సమీపంలోని పోలింగ్ కేంద్రానికి వెళ్లి బీఎల్‌ఓలను సంప్రదించి ఓటర్ గుర్తింపు కార్డుకు ఆధార్ అనుసంధానం చేసుకోవాలని పేర్కొన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా తమ పేరు నమోదు చేసుకుని ఎన్నికలలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా లా ఆఫీసర్ చంద్రావతి, జిల్లా భూసేకరణ అధికారి శంకర్ కుమార్, డీఆర్‌డీఓ సాంబశివరావు, డీఈఓ విజయకుమారి, ఎస్సీ అభివృద్ధి శాఖ జిల్లా అధికారి వినోద్‌కుమార్, డీపీఆర్‌ఓ స్వర్ణలత, వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.